# “మళ్ళీ తెల్లవారింది”

ఎమ్మెస్సార్. మూర్తి. కథ



ఎందుకు ఇలా తెల్లవారుతుంటుందో...?!? అని ఎన్నోసార్లనుకుంది సునీత.

తెల్లవారినప్పట్నుంచి పొద్దుగూకేదాకా పనిచేసి వళ్ళు పులుస్తుంటుంది.

సునీత భర్త సూర్యారావుకి పులిహోరంటే ఎంతో ఇష్టం.

సునీతంటే అంతకంత ఇష్టం.

సునీతని అస్తమానం తింటూ ఉంటాడు

వేపుకు తింటుంటాడు.

సరసమో, శృంగారమో.. కొరుక్కు తింటూంటాడు.

మామిడిపండు ముక్కలుగా తరిగి విడివిడిగా తినడం అతనికి సుతారామూ ఇష్టం ఉండదు.

పండును నోటికి పట్టించడమో...నోటిని పండుకు పట్టించడమో...

అప్పుడతని ముఖం చూడాలి !

అందుకే సూర్యారావు తనని తినాలనుకుంటున్నపుడు తింటూన్నపుడు అనాలోచితంగా కళ్ళుమూసుకోవడం అలవాటై పోయింది సునీతకి.

అగ్రహాపాట్లో సునీతకి ముగ్గురు పిల్లలు పుట్టి కళ్ళముందు ఎదుగుతున్నారు.

అయినా సూర్యారావు తినడం మానడు. వేపుకు తినడం వదలడు. కొరుక్కు తినడం కోసం తనలో కొత్తచోట్లు వెదకడం ఆపడు.

ఇక అత్తగారు, ఆ ఇద్దరు ఆడబిడ్డలు అంకుశంలాంటి మాటలతో పులిసిన వంటిని పుండయ్యేట్టు పని చేయిస్తుంటారు.

సునీతకి అపుడపుడూ కోపం వచ్చేది. ఆకోపంతో ఏమీ చేయలేదు గనక ఏడుపొచ్చేది. ఏడుపు వస్తే ఆగదు గనక ఏడ్చేది.

పత్రికల్లో కథలు చదివేపుడు ఎవర్నయినా ప్రేమించి ఉంటే బాగుండేదేమో అనిపించేది. నవల చదవడం ముగిశాక – నాన్న కట్నం ఇంకాస్త ఎక్కువిచ్చి ఇంకొకరికిస్తే ఇంకెలాగుండేదో... అనిపించేది.

స్నానాలగదిలో కెళ్ళి గడియపెట్టుకుని ... కనీసం తనివితీరా స్నానం చేయలేక పోతినే అంటూ గోడకి మోకాలు పొడుచుకున్నపుడల్లా అనుకునేది.

ఒక్క మనిషేపట్టే అబాత్‌రూంలో వంకికి వేలాడే లంగా నాడాలు తగిలి ఉలిక్కి పడేది.

* * *

ఆరోజు సూర్యారావు కొట్టిన దెబ్బకి చెంపగుయ్యిమంది. వళ్ళో ఉన్న చంటాడికి తగిలినట్లయింది...

ఆరోజే సునీత తన చిలక రంగు ట్రంకు పెట్టి గట్రా ఎంత డబ్బుందో .. ఎన్ని చిల్లర పైసలున్నాయో లెక్కెట్టుకుంది. ఏడురూపాయలా నలభై అయిదు పైసలు. కొట్లో కొనక్కర్లేని, కొంటేరాని .. ధైర్యం ... ఎల్లాగో తెచ్చుకోగలిగింది.

తన స్నేహితురాలు అలివేలు ఫ్రెండ్ అదేదో ఆడవాళ్ళ సమస్యలని విని ఆదుకునే సంఘంలో ఉందంటే ...

మళ్ళీ ధైర్యం పుంజుకుని, పిల్లల్ని ఇంట్లోనే వదిలేసి వెళ్ళింది

ఆవిడ పేరు రమ.

రమ తన గోడంతా తీరిగ్గా వింది.

ఆశ్చర్యంగా ఏనలేదు. ఆఫీసులో ఉన్న సూర్యారావుకి ఫోన్ చేసి పిలిపించింది. వాళ్ళిద్దరికీ జీవితమంటే ఏమిటో సర్ది చెప్పింది.

“అడపాదడపా కొడితే మాత్రం నేను అంత దుర్మార్గుడినా.. ఇక రాక్షసుడ్నేనా.. నాలో ప్రేమలేదనుకున్నారా? మనం పిల్లల్ని మందలించడం లేదా? కొట్టటం లేదా? అలాగే... నాభార్యని...” అంటు పాలసీ లేవదీశాడు సూర్యారావు.

“నేన్నిజం మాట్లాడుతున్నాను” అంటూ తల విదిలించాడు.

కొట్టి మరీ నిజం చేప్పే ధైర్యం మగాళ్ళకే ఉందన్న ఈనిజం సునీతకి మరింత భయం పుట్టించింది.

తనూ అంది – “ప్రేమించడమంటే కళ్ళుమూసి

గుర్రుమంటూ చూడ్డమా? కొట్టడ౦ా? తిట్టడమా... అంతా చేసి... అర్థరాత్రిన పక్కలో చేరి.. ఛీఛీ... నేన్నచ్చకపోతే నాపనులంటే అయిష్టం అయితే... నాముఖం చూడగూడదు గదా - నావంటిమీద చెయి వెయ్య కూడదు గదా ..."
సునీత ఏడవకుండా అంది "అవే చేతులు అవి చేతులా..?"
అలా వాళ్ళిద్దరూ ఎడాపెడా చెప్పే పచ్చి నిజాలు తను ఏ ఇంగ్లీషుకాదు గదా తెలుగు పుస్తకాల్లో కూడా చదవలేదని విస్తుపోయింది రమ.
అలా ఒకర్నొకరు బాగా అనుకొని అలసిపోయారు.
రమాదేవి పెట్టిన అన్నం ఎడముఖం పెడముఖం పెట్టి తిన్నారు.

* * *

కూరిమి ఉండే కాపురాలలో నేరాలే కనపడవు. కలతపడ్డ దంపతులు కలసి నడుస్తుంటే వేగిరగా పడే అడుగులలో ఊళ్ళు దాటిన అలసట. మైళ్ళు నడవాల్సిన వేదన.
వివాహం చేస్తారు. పెళ్ళవుతుంది.
శోభనం చేస్తారు. కార్యమవు తుంది.
పురుళ్ళు ... పిల్లలు...
ఇవన్నీ జరిగాక భార్యాభర్తల అన రాగం ఇకెంత సొంపుగా ఇంపుగా ఉండాలి ?
తీయగా ఉండాలి?
విరిగిపోయిన పాలలా వెలవెల పోతూ సూర్యారావు, సునీత వాల్మీకినగర్ నుండి బయటపడి ట్యాంక్‌బండ్ మెట్లెక్కారు.
చల్లటి వాతావరణం.
ఎటూ పరిష్కారం కాలేదు.
సునీత కాళ్ళు చల్లబడి పోయాయి.
' కాసేపే అలా కూర్చొని వెళదామా? " అంది.
సూర్యారావుకీ చల్లబడాలని ఉంది.
పదమన్నట్టు తలూపాడు.
హుసేన్‌సాగర్ని చూస్తూ బెంచీమీద కూచోబోయింది సునీత.
" ఇలా బజార్నపడ్డావన్నమాట", అన్నాడు సూర్యారావు.
కూర్చోబోయిన సునీత అలాగే నిలబడి ఉంది.
రైలింగ్‌కి ఆనుకుంది.
తను బజార్న పడింది.
ఆనీళ్ళు అలల్లా నవ్వినట్లనిపించింది.
బజార్నపడిన చాలామంది నీళ్ళలో పడ్డారన్న అపవాదం "వల" అలా తన మీదికి విసిరినట్లనిపించింది.
గాలంలా తగిలింది.
అంతే

రైలింగ్ మీద రెండడుగులు.
సునీత హుసేన్‌సాగర్‌లోకి దూకేసింది.
సూర్యారావుకి అర్థం కాలేదు.
వెంటనే అర్థమయింది.
ఏదో తనకే తెలీని కేకేశాడు.
ఆవేశంగా తనూ నీళ్ళలోకి చూసేడు.
తను నీళ్ళలోకి దూకినట్టు అప్పటిగ్గాని తెలియలేదు సూర్యారావుకి.
తను... ఏంచేస్తున్నాడు...
ఏంచెయ్యాలి ?
ఎలా ?
సునీత నీళ్ళలోకి వెళ్ళిపోతోంది.
ఓ చేపపిల్లగామోను బొడ్డును కరిచింది.
అబ్బ ఎంత చక్కలిగిలో అనుకుంది.
సునీత ఇంకా లోతుకు పోతోంది.
ఇంతవరకూ మోసిన బరువుతో ఇంకా లోతుకు...
ఎన్నాళ్ళనుంచో ఆకాశంలో పక్షిలా ఎగిరేంత స్వాతంత్ర్యం వస్తే బాగుండుననుకున్న సునీతకి ఆనీళ్ళలోతుల్లో అంత స్వతంత్రంగా తిరిగి కాళ్ళు బురద అనగానే చేతులు విలాసంగా ఆడించింది.



చిన్నప్పుడు దిగుడు బావి వెన్నెల్లాంటి ఎండలో ఈదడం
గుర్తొచ్చి నవ్వాలనిపించింది.
దమ్ముసడలేలోగా
ఝుమ్మంటూ ఈదుకుంటు అల్లంతదూరాన తేలింది.
దూరంగా సూర్యారావు
చేతులు పైకి ... కేకలు ... మునక ...
ఆదరాబాదరా ఈదుకొచ్చి, అలా అసహాయంగా
కళ్ళుతేలవేస్తున్న సూరారావుని వీపుమీద వేసుకొని
ఈదుకొచ్చి వడ్డుకు చేర్చింది.
ఒడ్డున వగరుస్తున్న సూరారావు
వమిటచెండుని యధాలాపంగా పిండుకుంటూనే
అతనివేపు చూస్తున్న సునీత.
సూర్యారావుకి ఫస్ట్ ఎయిడ్ చెయాలా అక్కర్లేదా అని
పడుకోబెట్టి పరిశీలిస్తున్నాడాయన.
ఇద్దరూ ఆత్మహత్యకు తలపడ్డారన్న పొగలు,
పోలీసుల సెగలు.
ఓ అరగంట గందరగోళం.
అవుడెప్పుడో పీటలమీద కూర్చోబెట్టిన సమాజవు
కట్టుదిట్టాలే ఇవుడు ఆటోలో కూచోబెట్టాయి.
ఈసంఘటన తెచ్చిన సావ సంతో సునీత
భయాలు మరీ పేలవమై పోయాయి.

* * *

ఆవేశంగా ఇద్దరూ అలానీళ్ళలో పడ్డప్పుడు తేలిన మానవ నైజం పదేపదే తెల్లారుతున్న రోజులకి ప్రాణం పోస్తూ ఓ పదేళ్ళు గడిచాయి.
పెద్దాడిని నాగార్జున సాగర్‌లో రెసిడెన్షియల్ కాలేజీలో చేర్పించడానికి ఇద్దరూ వెళ్ళి – ఆసాయంత్రం యధాలాపంగా గట్టుమీద షికారు కెళ్ళారు.

సూర్యారావు ఆగాడు.
విశాలంగా పరుచుకున్న నీళ్ళవైపు సునీత
వైపు మార్చి మార్చి చూశాడు.
ఈపదేళ్ళలో ఎన్నోసార్లు తను ఈత
నేర్చుకుందామనుకున్నాడు.
ఈత... అనగానే మళ్ళీ ఆ టాంక్‌బండ్ రభస గుర్తుకొచ్చి...
నీళ్ళు మింగి ఊపిరాడ పోవడం జ్ఞాపకం వచ్చి ...
మానేవాడు.
నిద్రలో ఈదుతున్నట్టు కలవరంగా కేకేశేవాడు.
సూర్యారావు కళ్ళు ఎర్రబడ్డాయి.

ముక్కు పుటలెగిరాయి.
పళ్ళు కటకటా అన్నాయి.
ఏవిటన్నట్టు అర్థం కాక చూసింది సునీత.
చెంపమీద చేత్తో ఒకటిచ్చాడు.
సునీతకది అలవాటే అయినా
అసలవుడు అతను... తనభర్త... ఎందుకలా చేస్తున్నాడో.
ఏమీ అర్థంకాక కోపంగా నీళ్ళల్లోకి
చూసి సూర్యారావు వేపు ఉరిమి చూసింది.
ఆచూపుల్లో లోతులూహించిన సూర్యారావు
చటుక్కున పక్కకి జరిగాడు.
మరీభయం పుట్టిన భర్తను చూసి జాలిగా అడిగింది సునీత
"ప్లీజ్ ఎందుక్కొట్టారో చెప్పరా?"
"పెళ్ళయి అన్నేళ్ళయినా నాకు ఈత వచ్చంటూ ఎవుడైనా
చెప్పేవా ? ఎంత పొగరు?" అన్నాడు.
విస్తుపోయింది సునీత.
మస్తిష్కం కాసేపు పనిచేయడం ఆగి మళ్ళీ
మొదలైనట్లనిపించింది.
దూరంగా సూర్యుడు.
ఎర్రగా...
అప్పుడు తప్ప అసలు సూర్యుడ్ని నింపాదిగా చూడలేమ
లేపోతే...అంతే ఉదయాన్నే కూడ చూడొచ్చు...
పరమ నిర్మోహమాటంగా కొండల్లో పడుతున్నాడు.
తనెన్ని కథలు చదివింది!
మంచుబిందువులతో
సూర్యుడి లేతకిరణాలతో...
కథలు మొదలవులుంటాయి.
అలాగే
కందిన సూర్యుళ్ళెంతమందో కొండల్లోకి జారుతూ ఎన్ని
కథలకు ముగింపు పలికారు.
కానీ
ఏసూర్యుడి కిరణాలూ కొట్టే భర్త చేతుల్ని...
అతర్వాత తారట్లాడే అదేచేతివేళ్ళనీ
వారించలేక పోయాయి.
జలదరింపుగా పైటసవరించుకుంది సునీత.
ఏఉషస్సూ పక్కమీదినుండి లేవగానే చేయాల్సిన
ఇంటిపనుల భారానికి సానుభూతి పలకలేదు.
అలా తెల్లారుతూనే ఉంటుంది.
రేపుకూడా ఇలాగే ... మళ్ళీ ...